సాక్షి ఏలూరు

శనివారం । 10 । ఫిబ్రవరి । 2024



నేటి నుంచి రథసప్తమి ఉత్సవాలు

ఆగిరపల్లిలోని శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శనివారం నుంచి రథసప్తమి ఉత్సవాలు నిర్వహించనున్నారు. 8లో



అంబేడ్కర్ విగ్రహాలు హర్షణీయం

తెలుగు రాష్ట్రాల్లో అంబేడ్కర్ విగ్రహాలను ఏర్పాటు చేయడం హర్షణీయమని ఐడియా అధ్యక్షుడు రాజసుందర్‌బాబు అన్నారు. 8లో



పారిజాతగిరిలో కల్యాణోత్సవం

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం చొల్లంగి అమావాస్య కావడంతో శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహించారు.

న్యూస్‌రీల్

రాజ్యసభకు కొవ్వలివాసి



సీఎం జగన్‌తో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

దెందులూరు: దెందులూరు మండలం కొవ్వలి గ్రామ వాసి, పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావుకు రాజ్యసభ అభ్యర్థిగా సీఎం జగన్ అవకాశం కల్పించారు. కొవ్వలికి చెందిన గొల్ల సత్యం, సాయమ్మ కుమారుడు బాబూరావు ప్రస్తుతం పాయకరావుపేట వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఎమ్మెల్యేగా మూడుసార్లు పనిచేశారు. ఆయన ఉమ్మడి రాష్ట్రంలో పంచాయతీరాజ్ శాఖ కమిషనర్‌గా పనిచేసినప్పుడు దివంగత వైఎస్సార్‌తో బంధం ఏర్పడింది. అలా ఆయన పాయకరావుపేట ఎమ్మెల్యేగా గెలుపొందారు. అనంతరం జగన్‌మోహన్‌రెడ్డితో అనుబంధంగా మారి ఎమ్మెల్యే నుంచి రాజ్యసభకు ఎంపిక చేసేలా ఉపయోగపడింది. గురువారం రాష్ట్రం నుంచి ముగ్గురిని రాజ్యసభకు అభ్యర్థిత్వం ఖరారు చేయగా గొల్ల బాబూరావు ఒక్కరు. ఆయన్ను రాజ్యసభ అభ్యర్థిగా ప్రకటించడంపై గ్రామీణ ప్రజలు, దళిత వర్గాలు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సమాజంపై బాధ్యత ఉండాలి



ర్యాలీ చేస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్) : ప్రతి వ్యక్తి సమాజంపై బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. వెట్టిచాకిరీ నిర్మూలన దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఏలూరులో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి కె.రత్నప్రసాద్, కార్మిక శాఖ ఉప కమిషనర్ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఎక్కడైనా వెట్టి చాకిరీ చేయిస్తున్నట్టు గుర్తిస్తే తమకు తెలియజేయాలని రత్నప్రసాద్ సూచించారు. బాధితులకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఉచితంగా న్యాయ సహాయం చేస్తుందన్నారు. బాధితులకు పునరావాసం కల్పించే వరకూ సహాయ పడుతుందన్నారు. డీసీపీఓ సూర్యచక్రవేణి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీనివాస్, దిశ ఎస్సై కాంతి ప్రియ, ప్యానల్ లాయర్ కూన కృష్ణారావు, ఏఎల్ఎస్ కో–ఆర్డినేటర్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన ఇంటర్ ప్రాక్టికల్స్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇంటర్మీడియెట్ ఒకేషనల్ ప్రాక్టికల్స్‌కు శుక్రవారం 632 మంది హాజరయ్యారు. జిల్లాలోని 7 కేంద్రాల్లో మధ్యాహ్నం 780 మందికి 632 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని ఇంటర్మీడియెట్ పరీక్షల కన్వీనర్ బి.ప్రభాకర్ తెలిపారు. ఈనెల 11 నుంచి ఒకేషనల్ విద్యార్థులకు రెండో విడత, జనరల్ విద్యార్థులకు మొదటి విడత ప్రయోగ పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు.

డీఈఓ విచారణ

జంగారెడ్డిగూడెం: విద్యార్థినులతో ఉపాధ్యాయుడు అనుచిత ప్రవర్తనపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో జంగారెడ్డిగూడెం బాలుర జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం డీఈఓ ఎస్.అబ్రహం, డీవైఈఓ మడకం రామన్నదొరతో కలిసి విచారణ నిర్వహించారు. పాఠశాలలో ఉపాధ్యాయులను, విద్యార్థులను సదరు ఆరోపణలకు సంబంధించి ఏం జరిగిందనే విషయంపై వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ నిర్వహించామన్నారు. విద్యార్థినులను, వారి తల్లితండ్రులను, ఉపాధ్యాయులను విచారించి వివరాలు నమోదు చేసుకున్నామన్నారు. నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తామని చెప్పారు.

గోడౌన్ల నిర్మాణం వేగిరపర్చాలి

భీమవరం (ప్రకాశంచౌక్): మల్టీపర్పస్ గోడౌన్లను త్వరితగతిన పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లాస్థాయి అమలు కమిటీ సభ్యులతో గోడౌన్ల నిర్మాణాలపై సమీక్షించారు. జిల్లాలో 22 గోడౌన్ల నిర్మాణాలకు ఇప్పటివరకు అజ్జమూరు, మల్లవరం, ఆచంట, పోడూరు, చినమల్లం, మోగల్లు, పెనుమంచిలి, పండితవల్లూరులో నిర్మాణాలు పూర్తయ్యాయని, మిగిలినవి పలు దశల్లో ఉన్నాయన్నారు. పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇన్‌చార్జి జిల్లా కో–ఆపరేటివ్ అధికారి కేసీహెచ్ అప్పారావు, డీసీసీబీ ఏజీఎం నరసింహరావు, ఏడీ మార్కెటింగ్ శ్రీనివాసరావు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి సీహెచ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

సర్కారీ బడి.. కార్పొరేట్ సవ్వడి

ఇదీ మార్పు

సీఎం జగన్ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. మనబడి నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుస్తున్నారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాలలను కార్పొరేట్ విద్యాసంస్థలను తలదన్నేలా తీర్చిదిద్దుతున్నారు. చింతలపూడిలో ప్రభుత్వ హైస్కూల్‌ను రూ.38 లక్షలతో ఆధునీకరించారు. తరగతి గదులు, మరుగుదొడ్లు అభివృద్ధి చేయడంతో పాటు అధునాతన ఫర్నిచర్, తాగునీటి కుళాయిలు, ట్యూబులైట్లు, ఫ్యాన్లు, గ్రీన్ బోర్డులు ఏర్పాటుచేశారు. ప్రహరీలు పునరుద్ధరించి రంగుల బొమ్మలతో తీర్చిదిద్దారు.

– చింతలపూడి



నాడు.. చింతలపూడిలో ప్రభుత్వ హైస్కూల్



నేడు.. అభివృద్ధి చేసిన చింతలపూడిలో ప్రభుత్వ హైస్కూల్

ప్రభుత్వ ఆశయాలు ఫలించేలా..

- క్షేత్రస్థాయిలో విద్యాశాఖ పనితీరుపై అంచనా
- 208 మంది అధికారులు 1,679 పాఠశాలల పరిశీలన
- విద్యా సంబంధ అంశాలపై తనిఖీ
- మూడు రోజుల ప్రత్యేక కార్యాచరణ



జంగారెడ్డిగూడెం జెడ్పీ స్కూల్‌లో సిలబస్‌పై విద్యార్థులతో చర్చిస్తున్న డీఈఓ అబ్రహం



గణపవరం మండలం డి.కుముదవల్లి హైస్కూల్‌లో పుస్తకాలు పరిశీలిస్తున్న ఎంఈఓ రాంబాబు

నిడమర్రు: ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు సీఎం జగన్ ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చింది. కోట్లాది రూపాయలతో మనబడి నాడు–నేడు పథకంలో పాఠశాలల రూపురేఖలు మారుస్తున్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా 3వ తరగతి నుంచి సబ్జెక్ట్ టీచర్ల బోధన, ద్విభాషా పాఠ్యపుస్తకాలు, డిజిటల్ బోధనకు పరికరాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. గతేడాది నుంచి 8వ తరగతి చదివే విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్స్ ఇస్తున్నారు. అయితే వీటిని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఏస్థాయిలో వినియోగిస్తున్నారో తెలుసుకునేందుకు 20 నెలలుగా స్కూల్ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ తనిఖీలు చేస్తున్నారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో తరగతి గదుల్లో కనిపించే లోపాలను ఉపాధ్యాయుల కంటే విద్యాశాఖాధికారుల పర్యవేక్షణ లోపంగా ఆయన అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నూతనంగా ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారిగా ఎస్.అబ్రహం బాధ్యతలు తీసుకున్న రోజు నుంచే ప్రభుత్వ పాఠశాలల పనితీరుపై క్షేత్రస్థాయి పరిశీలనకు ఏర్పాట్లు చేశారు. దీనిలో భాగంగా గురువారం రాత్రి వరకూ జిల్లాలోని డీవైఈఓలు, హైస్కూల్ హెచ్‌ఎంలు, ఎంఈఓలు, సెక్టార్ అధికారులతోపాటు సర్వశిక్షా అధికారులతో సమావేశం నిర్వహించి ప్రణాళికను రూపొందించారు. శుక్ర, శని, సోమ వారాల్లో మూడు రోజులపాటు జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో విజిట్స్ జరిగేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ఈ మేరకు శుక్రవారం జిల్లాలోని పలు పాఠశాలలను అధికారులు తనిఖీ చేశారు.

తొలిరోజు 545 పాఠశాలల్లో..

జిల్లాలోని 45 మంది ఎంఈఓలు, నలుగురు సెక్టోరియల్ అధికారులు మొత్తం 407 స్కూళ్లను విజిట్ చేయాలి. వీటిలో 215 జెడ్పీ, 192 యూపీ పాఠశాలలు ఉన్నాయి. 159 మంది స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్‌లు 1,272 ప్రాథమిక పాఠశాలలను సోమవారం లోపు పరిశీలించాలి. తొలిరోజు 545 పాఠశాలల్లో విజిట్ పూర్తయ్యిందని జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు.

పలు అంశాలపై..

పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, అకడమిక్ క్యాలెండర్ ప్రకారం బోధన, నెలవారీ సిలబస్ పూర్తి, నోట్సులు, నోట్సులను ఉపాధ్యాయులు దిద్దడం, బైజూస్ ట్యాబ్స్ వినియోగం, స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీ బోర్డులపై ఉపాధ్యాయులకు అవగాహన, టోఫెల్ తరగతుల నిర్వహణ, సీబీఏ–2 పరీక్ష పత్రాల మూల్యాంకనం, ఆర్వో డ్రింకింగ్ వాటర్ సిస్టమ్‌ల వినియోగం తదితర అంశాలను పరిశీలించేలా విజిటింగ్ ప్రొఫార్మా రూపొందించారు.

జంబ్లింగ్ విధానంలో..

పాఠశాలల విజిట్స్ పారదర్శకంగా జరిగేందుకు ప్రస్తుతం పనిచేస్తున్న మండలాలు, కాంప్లెక్స్‌ల్లో కాకుండా ఆయా ఎంఈఓలను, చైర్మన్లను సమీప మండలాలు, కాంప్లెక్స్‌లకు టీమ్‌లుగా నియమించారు. శుక్రవారం 545 స్కూళ్లను విజిట్స్ చేశారు. మిగిలిన అన్ని పాఠశాలల్లో శని, సోమవారం విజిట్స్ చేసి, అధికారులు గుర్తించిన అంశాలను నిర్ణీత నమూనాలో సేకరించేలా అధికారులు ప్రణాళిక రూపొందించారు.

మరింత బలోపేతానికి..



జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో క్షేత్రస్థాయి కనిపించే లోపాలు, సమస్యలు తెలుసుకునేందుకే అధికారుల బృందాల విజిట్స్. ఈ విజిట్స్ సోమవారంతో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తయ్యేలా కార్యాచరణ రూపొందించాం. ఇలా మండల, కాంప్లెక్స్ స్థాయిల్లో అధికారుల పనితీరు తెలుసుకుని లోపాలను సవరించి జిల్లాలో ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నాం.

–ఎస్.అబ్రహం, డీఈవో, ఏలూరు

11 స్కూళ్లలో మూడు పూర్తి



నాకు ఏలూరు, పెదవేగి మండలాల్లోని 11 పాఠశాలలను విజిట్ చేసేలా డీఈఓ ఆదేశాలు ఇచ్చారు. శుక్రవారం మూడు స్కూళ్లలో విజిట్ పూర్తి చేశాను. ఉపాధ్యాయులంతా వారి వర్కులు అప్‌డేట్‌గానే ఉంచారు. ఆయా పాఠశాలల్లో చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని తెలుగు, ఇంగ్లిష్ చదవడం, రాయడం, గణితంలో చతుర్విధ ప్రక్రియలపై దృష్టి పెట్టాలని సూచించాను.

– సబ్బిత నర్సింహమూర్తి, ఎంఈఓ, పెదపాడు

వ్యక్తిగత శుభ్రతతో ఆరోగ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వ్యక్తిగత శుభ్రతతోనే పరిపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి అన్నారు. శుక్రవారం స్థానిక సీఆర్ఆర్ పబ్లిక్ స్కూల్‌లో జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు డీఎంహెచ్ఓ శర్మిష్టతో కలిసి జేసీ ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. డీఎంహెచ్ఓ శర్మిష్ట మాట్లాడుతూ భోజనం చేసే ముందు కచ్చితంగా చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. ఆల్బెండజోల్ మాత్రలతో ఎటువంటి ఇబ్బందులు ఉండవని, అపోహలకు తావివ్వొద్దన్నారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ నాగేశ్వరరావు, ఆర్బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ నరేంద్రకృష్ణ, జిల్లా మేనేజర్ నరేష్ బొప్పన, సీఆర్ఆర్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ వంకినేని రఘుకుమార్, ప్రిన్సిపల్ రాజ కళ శ్రీధరి పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న జేసీ లావణ్యవేణి

విభిన్న ప్రతిభావంతులకు రుణాలు

ఏలూరు(మెట్రో): జిల్లాలో విభిన్న ప్రతిభావంతులైన దివ్యాంగులకు తక్కువ వడ్డీతో ఈఎంఐ ద్వారా జాతీయ దివ్యాంగుల ఆర్థిక అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్ఎఫ్‌డీసీ) రుణాలు మంజూరు చేసిందని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎన్‌హెచ్ఎఫ్‌డీసీ జిల్లా మేనేజర్, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వృద్ధుల సహాయ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ రాకడ మణి ఆధ్వర్యంలో రూ.19 లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ దివ్యాంగుల స్వయం ఉపాధి కోసం ఒక్కొక్కరికీ రూ.4.75 లక్షల రుణాలు మంజూరు చేశామన్నారు. రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏడీ రాకడ మణి మాట్లాడుతూ దివ్యాంగులైన బేతు విజయవాణి, జుజ్జువరపు వెంకటేశ్వరరావు, కంకిపాటి బాబూరావు, కంకిపాటి చిరంజీవికి రుణాల చెక్కులు అందించారన్నారు.

మహిళా సాధికారతకు 'ఆసరా'



మండవల్లిలో ఆసరా సభకు హాజరైన లబ్ధిదారులు

రాష్ట్రంలో మహిళా సాధికారత, స్వావలంబన లక్ష్యంగా సీఎం జగన్ పథకాలు అమలుచేస్తున్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా రుణమాఫీని వైఎస్సార్ ఆసరా సాయంగా అందిస్తున్నారు. జిల్లాలో నాలుగో విడత ఆసరా సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం కైకలూరు నియోజకవర్గంలో ఆసరా కార్యక్రమం నిర్వహించారు.

– మండవల్లి

కుటుంబానికి చేదోడుగా..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి డ్వాక్రా మహిళలకు అండగా నిలిచారు. వారి సమస్యలను ఇచ్చిన హామీ మేరకు తీర్చారు. నాకు రూ.25 వేల రుణమాఫీ అయ్యింది. మా కుటుంబానికి ఇది ఎంతో ఆసరాగా ఉంది.

–భోగాది లక్ష్మీ సుజాత, మండవల్లి

రూ.56 వేల లబ్ధి



సీఎం జగన్ అమలుచేసిన రుణమాఫీ పథకం మా కుటుంబానికి ఎంతో ఆసరాగా నిలిచింది. నాకు ఆసరా పథకం కింద నాలుగు విడతల్లో రూ.56 వేల లబ్ధి చేకూరింది. ఇది మా కుటుంబానికి ఓదార్పు నిచ్చింది.

– కోట భవాని, మండవల్లి

ఇచ్చిన హామీని అమలుచేస్తూ..

సీఎం జగన్ ఏదైనా చెప్పారంటే.. చేస్తారంతే అనడానికి డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన హామీని అమలు చేయడమే నిదర్శనం.

– దూలం నాగేశ్వరరావు, కైకలూరు ఎమ్మెల్యే

(మండవల్లిలో శుక్రవారం జరిగిన ఆసరా కార్యక్రమంలో..)



మండవల్లిలో మహిళలకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ, ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్ యాదవ్

విర్డ్ సేవలు అభినందనీయం

ద్వారకాతిరుమల : దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు 'విర్డ్' ఆస్పత్రి సేవలు అభినందనీయమని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. ద్వారకాతిరుమల విర్డ్ ఆస్పత్రిలో దివ్యాంగులకు అందిస్తున్న కాలిపర్స్, కృత్రిమ అవయవాలు, వైద్య సేవలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ప్రోస్టాసిస్ 3డీ ప్రింట్‌తో తయారైన కృత్రిమ అవయవాలను దివ్యాంగులకు అందజేశారు. ఆస్పత్రిలో సేవలపై డాక్టర్ భవ్యచంద్ ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కృత్రిమ అవయవాల పంపిణీ ద్వారా నూతన జీవితాన్ని అందించవచ్చన్నారు. ఆస్పత్రిలో రోగుల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. అర్హులకు దివ్యాంగుల పింఛన్ అందించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. ఆస్పత్రి చైర్మన్ ఎస్వీ సుధాకరరావు మాట్లాడుతూ ప్రోస్టాసిస్ 3డీ ప్రింట్‌తో తయారైన కృత్రిమ అవయవాలను బాధితులకు ఉచితంగా అందిస్తున్నామన్నారు. గుప్తా ఫౌండేషన్ చైర్మన్ మడుపల్లి మోహన్‌గుప్తా కాలిపర్స్ అందించేందుకు సహకారం అందిస్తున్నారని చెప్పారు. ట్రస్టీలు ఐవీఆర్ సుధాకరరావు, వి.నారాయణమూర్తి, ట్రస్ట్ సభ్యులు హమీద్, బాలాజీ, విహారి, నాగేంద్ర బాబు సింధు, గాయత్రి పాల్గొన్నారు.



కృత్రిమ అవయవాలను పంపిణీ చేస్తున్న కలెక్టర్

అమ్మ దీవెన.. మహా నివేదన

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం మావుళ్లమ్మవారి ఆలయ 60వ వార్షిక మహోత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం అమ్మవారికి మహా నివేదన నిర్వహించారు. ఉదయం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మహా నివేదనను సమర్పించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం భారీ అఖండ అన్నసమారాధన ప్రారంభమైంది. నీరుల్లి, కూరగాయ పండ్ల వర్తక సంఘం, ఉత్సవ కమిటీ, దేవస్థానం సంయుక్తంగా జనవరి 13న ప్రారంభమైన ఉత్సవాలు 26 రోజుల పాటు ఘనంగా జరిగాయి. అమ్మవారికి ప్రసాదంగా సమర్పించిన 36 కేజీల లడ్డూను పట్టణానికి చెందిన నందమూరు ఆంజనేయులు రూ.1.60 లక్షలకు దక్కించుకున్నారు. వైఎస్సార్‌సీపీ నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల, ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, ఆలయ సహాయ కమిషనర్ యర్రంశెట్టి భద్రాజీ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి మహానివేదన సమర్పిస్తున్న విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

క్లుప్తంగా

ప్రతి అడుగూ విజయానికి మెట్టు కావాలి



ఏపీ నిట్‌లో మాట్లాడుతున్న గౌహతి ఐఐటీ ఆచార్యులు రవీంద్రనాథ్

తాడేపల్లిగూడెం: విద్యార్థి వేసే ప్రతి అడుగూ విజయానికి మెట్టు కావాలని గౌహతి ఐఐటీ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం ఆచార్యులు డాక్టర్ అడ్డా రవీంద్రనాథ్ అన్నారు. ఏపీ నిట్‌లో కాంప్రహెన్సీ ఓవర్ వ్యూ ఆఫ్ యాక్టివ్ పవర్ డికాప్లింగ్ విత్ అప్లికేషన్ స్విచ్డ్ బూస్ట్ ఇన్వెర్టర్ అనే అంశంపై శుక్రవారం మాట్లాడారు. కొత్త సాంకేతికలపై పట్టు సాధిస్తేనే ఆధునిక పోటీ ప్రపంచంలో నిలబడతారన్నారు. ఇన్వెర్టర్ నుంచి వచ్చే విద్యుత్ నాణ్యతను పెంచుకునేందుకు సమకూర్చుకోవాల్సిన పరికరాలపై అవగాహన కల్పించారు. కెపాసిటర్ ఇండక్టర్ పరికరాల ప్రాధాన్యత గురించి విద్యార్థులకు వివరించారు. ఎలక్ట్రికల్ రంగంలో నూతన ఆవిష్కరణల అవసరం ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ టి.రమేష్, ఆచార్యులు పి.శంకర్, ఫణికృష్ణ, వి.సందీప్, కిరణ్ తీపర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని యువకుడి మృతి

మండవల్లి: ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఓ యువకుడు శుక్రవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండవల్లి మండలంలో వెలుగుచూసింది. వివరాల్లోకి వెళ్తే లోకుమూడి గ్రామానికి చెందిన ధోనిపాటి అబ్రహం (26) కాకతీయనగర్‌లో ఉన్న కమిలి శివప్రసాద్ ఆరు ఎకరాల (లీజు) రొయ్యల చెరువు మీద నెల జీతానికి పని చేస్తున్నాడు. అయితే ఇటీవల కాలంలో అప్పులు చేసి పలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం చెరువు గట్టు మీద ఉన్న షెడ్డులో దూలానికి ఉరి వేసుకున్నాడు. ఈ విషయాన్ని గమనించిన యజమాని శివప్రసాద్ అబ్రహం తల్లి సుందరమ్మకు సమాచారం ఇచ్చాడు. ఆమె ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సీహెచ్‌ఎస్ రామచంద్రరావు తెలిపారు.

మైనర్ బాలిక కిడ్నాప్

ఏలూరు టౌన్: నగరంలోని ఒక ప్రాంతానికి చెందిన ఓ మైనర్ బాలిక (17)ను కిడ్నాప్ చేసిన యువకుడిపై శుక్రవారం పోలీసులు కిడ్నాప్ కేసు నమోదు చేశారు. ఏలూరులోని ఓ ప్రాంతానికి చెందిన బాలిక ఇంటర్మీడియట్ చదువుతోంది. శనివారపుపేటకు చెందిన గురిందపల్లి వినోద్ (21) అనే యువకుడు ఆ బాలికను ప్రేమ పేరుతో నమ్మించి ఈ నెల 1న శివాజీ సెంటర్ వద్ద ఉన్న ఎగ్జిబిషన్ గ్రౌండ్ నుంచి కిడ్నాప్ చేసి తీసుకుపోయాడు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు యువకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమ శకం

నవరత్నాలతో కుటుంబానికి జవసత్వాలు



సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశాక ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలు నా కుటుంబానికి జవసత్వాలనిచ్చింది. నాకు చేనేత కార్మిక పింఛన్ రూ. 3 వేలు మంజూరు చేశారు. చేనేత వస్త్రాలు ఆదరణ కోల్పోయిన వేళ ఈ సాయం చాలా మేలు చేసింది. నా భార్య డ్వాక్రా గ్రూపులో సభ్యురాలిగా ఉండడం వల్ల ఆసరా రుణమాఫీతో రూ.45 వేలు అప్పు తీరింది. 45 ఏళ్లు నిండడంతో చేయూత రూ.18,000 వచ్చింది. మా మనవళ్లకు అమ్మ ఒడి వస్తుంది. మాలాంటి పేద కుటుంబాలకు జగనన్నే అండా దండా.

– కూనం సత్యనారాయణ, చేనేత కార్మికుడు, చెక్కపల్లి, ముసునూరు



జగన్ బాబు వచ్చాక అన్నీ వచ్చాయ్



నా భర్త చనిపోవడంతో దివ్యాంగుడైన కుమారుడితో కలిసి ఉంటున్నాను. ముఖ్యమంత్రిగా జగన్‌బాబు వచ్చాక నా కుటుంబంలో నాకు చేయూత డబ్బులు రూ.18,750 నాలుగు సంవత్సరాలుగా వస్తున్నాయి. నాకు కుటుంబ పోషణకు వితంతు పెన్షన్ రూ. 3 వేలు ఇస్తున్నారు. నా కుమారుడు దివ్యాంగుడు కావడంతో వికలాంగుల పింఛన్ రూ. 3 వేలు ఇస్తున్నారు. ప్రతి నెలా ఇంటి దగ్గరకు రేషన్ బియ్యం ఇవ్వటం, పింఛన్ సొమ్ము ఇవ్వడంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. ఎప్పటికీ ముఖ్యమంత్రిగా ఎప్పుడూ జగన్ బాబే ఉండాలి.

– పొట్నూరి కనకదుర్గ, లక్ష్మీవారపుపేట, ఏలూరు

ముఖ్యమంత్రిగా మళ్లీ జగనే రావాలి



సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశాక ఆయన పెట్టిన పథకాలు మా కుటుంబాన్ని ఆదుకుంటున్నాయి. నాకు కాపునేస్తం పథకంలో రూ. 15 వేలు ఇస్తున్నారు. నాకు కాళ్ళు, చేతులు అనారోగ్యంతో వంకర్లు పోయాయి. నాకు వికలాంగుల పింఛన్ కింద ప్రతి నెలా రూ.3 వేలు ఇస్తున్నారు. నా భర్తకు వృద్ధాప్య పెన్షన్ రూ.3 వేలు ఇస్తున్నారు. ముఖ్యంగా వలంటీర్లు ప్రతి నెలా ఒకటినే ఇంటికి వచ్చి మరీ పింఛన్‌ను అందిస్తున్నారు. సచివాలయ వ్యవస్థ కారణంగా అవసరమైన అన్ని ధ్రువీకరణ పత్రాలు ఎలాంటి ఇబ్బంది లేకుండా పొందుతున్నాం. ప్రతి నెలా ఇంటి వద్దే రేషన్ బియ్యం ఇవ్వడంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా జీవిస్తున్నాం. పేదలను పెద్ద మనస్సుతో ఆదుకుంటున్న జగన్ బాబు మళ్లీ సీఎంగా రావాలని కోరుకుంటున్నాం.

– గోపిశెట్టి లక్ష్మి, 41వ డివిజన్, ఏలూరు

మెట్టలో ముమ్మరంగా రబీ సాగు

- 80 శాతం పూర్తయిన నాట్లు
- సబ్ డివిజన్‌లో 8,204 ఎకరాల్లో రబీ సాగుకు సన్నాహాలు



మెట్టలో బోర్ల కింద వేసిన వరి పంట

చింతలపూడి: మెట్ట రైతాంగమంతా ఇప్పుడు రబీ సాగులో ముమ్మరంగా నిమగ్నమై ఉన్నారు. ఈ సంవత్సరం తొలకరిలో వర్షాలు ఆశించిన విధంగా కురవడంతో రైతులు ఖరీఫ్ సాగు చేపట్టారు. కోతల సమయంలో వర్షాభావం ఏర్పడటంతో కొన్ని గ్రామాల్లో వరి పంటకు కావాల్సి సాగు నీరు అందక పంట ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. అనంతరం నవంబర్ నెలలో తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు మళ్లీ చెరువుల్లో నీళ్లు చేరాయి. వీటికి తోడు ఈ ఏడాది భూగర్భ జలాలు పుష్కలంగా అందుబాటులో ఉండటంతో రబీ పంట ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని రైతులు ఆశపడుతున్నారు. చింతలపూడి సబ్‌డివిజన్‌లో 8,204 ఎకరాల్లో రబీ వరి సాగు, 27,774 ఎకరాల్లో మొక్కజొన్న, 3,341 ఎకరాల్లో పొగాకు, 469 ఎకరాల్లో చెరకు, 200 ఎకరాల్లో పొద్దు తిరుగుడు, 689 ఎకరాల్లో వేరుశనగ పంటలు పండించడానికి లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు 80 శాతం వరి నాట్లు పూర్తయ్యాయని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు వాతావరణం కూడ అనుకూలంగా ఉండటంతో రైతులు రబీ దిగుబడిపై ఆశలు పెట్టుకున్నారు.

కలుపు నివారణ చర్యలు ముఖ్యం

రబీలో మొక్కజొన్నలో కలుపు నివారణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారులు తెలిపారు. కలుపు నివారణకు యట్రజిన్ మందును ఎకరానికి కేజీన్నర చొప్పున నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అలాగే చలికాలం వల్ల వరిలో జింక్ లోపం తలెత్తే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. అధికారుల సూచనలతో రైతులు రబీ సాగులో నిమగ్నమయ్యారు.

నీటి యాజమాన్యం పాటించాలి



గతంలో పోలిస్తే భూగర్భ జలాలు ఈ ఏడాది పెరిగాయి. నీటిని ఆదా చేసుకుని మెట్టలో రైతులు వ్యవసాయాధికారుల సూచనల మేరకు నీటి యాజమాన్యం సక్రమంగా పాటించాలి. మార్చి నెల వచ్చే సరికి చెరువుల్లో నీళ్ల తగ్గిపోయి సాగు నీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం ఉంది. ఇప్పటివరకూ నాట్లు వేయని రైతులు వరికి బదులు మొక్కజొన్న, వేరుశెనగతో పాటు అపరాల వంటి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

– బి.నాగకుమార్, ఏడీఏ, చింతలపూడి సబ్ డివిజన్

అంబేడ్కర్ విగ్రహాల ఏర్పాటు హర్షణీయం



రాజసుందర్‌బాబును సన్మానిస్తున్న గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆయా ప్రభుత్వాలు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలను ఏర్పాటు చేయడం హర్షణీయమని ఆలిండియా దళిత ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఐడియా) అధ్యక్షుడు గొళ్ళమూడి రాజ సుందర్ బాబు తెలిపారు. శుక్రవారం స్థానిక ఏపీ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల భవనంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ఐక్యరాజ్యసమితి ప్రతినిధులు అంబేడ్కర్‌ను ప్రపంచ విమోచకుడిగా ప్రకటించి జై భీమ్ పలికారని ఇది భారతదేశం గర్వించదగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై సభకు అధ్యక్షత వహించిన గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాదెండ్ల బాబ్జి, సహాయ కార్యదర్శి మొహమ్మద్ జుల్ఫీకర్ అలీలు వివరించగా, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం. శేఖర్ బాబు, ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఐడియా అధ్యక్షుడు రాజ సుందర్ బాబుని ఘనంగా సత్కరించారు.

26న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక జన మహాసభ



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు కట్లయ్య

కాళ్ల: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక జన మహాసభ ఈ నెల 26న ఏలూరు పట్టణంలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర రజక సంఘ ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక సంఘం అధ్యక్షులు చిలకపల్లి కట్లయ్య తెలిపారు. మండలంలోని పెద అమిరం గ్రామంలో రజకుల చెరువు వద్ద రజకుల ఫెడరేషన్ డైరెక్టర్ గోగురాజుతో కలిసి శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలలో వెనుకబడి ఉన్న రజకులను ప్రజాప్రతినిధులు, అధికారులు ఆదుకోవాలని ఆయన కోరారు. ఏలూరు జిల్లా, పశ్చిమగోదావరి జిల్లా, తూర్పుగోదావరి జిల్లా, కొవ్వూరు వరకు ఉండే గ్రామాలు, మండలాలు, పట్టణాల నుండి పెద్ద సంఖ్యలో రజకులందరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో భీమవరంలో ఏడవ వార్డులో రజకుల విశ్రాంతిభవనానికి 20 లక్షలు స్థానిక ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ కేటాయించారని ఈ సందర్భంగా ఆయనకు కార్పొరేషన్ డైరెక్టర్ రేవూరి గోగురాజు కృతజ్ఞతలు తెలిపారు. పెనుగుర్తి చిన్నపన్న, యండమూరి ప్రసాదు, యండమూరి సింహాద్రి పాల్గొన్నారు.

నేటి నుంచి శోభనాచలుని రథసప్తమి ఉత్సవాలు



వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి

ఆగిరిపల్లి: మండలంలోని ఆగిరపల్లిలో ఉన్న శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో శనివారం నుంచి కల్యాణోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మాఘమాస కల్యాణ మహోత్సవ తిరునాళ్లకు జిల్లా వారే కాకుండా పొరుగు జిల్లాల నుంచి కూడా భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు. శనివారం సాయంత్రం స్వామి వారిని చంద్ర ప్రభ వాహనంపై ఊరేగింపుగా కల్యాణ మండపంలో తీసుకువచ్చి పెళ్లి కుమారుడిగా అలంకరించి రాత్రి 9 గంటలకు నిత్య కల్యాణాన్ని వేద పండితులు జరిపిస్తారు. ఇలా పది రోజుల్లో పాటు గ్రామోత్సవాలు నిర్వహించనున్నారు. ముఖ్యంగా ఈ నెల 17న ఉదయం 8 గంటలకు గ్రామంలోని నాలుగు మండపాల చుట్టూ గోవింద నామస్మరణ మధ్య అంగరంగ వైభవంగా రథోత్సవం నిర్వహించనున్నారు. 18, 19 తేదీల్లో నిత్య కల్యాణం, 20న యోగాంజనేయ స్వామి వారికి పంచామృత స్నపన, రజత ఉయ్యాల ఉత్సవం, పుష్పయాగంతో ఉత్సవాలు ముగుస్తాయి. శనివారం నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాలకు నూజివీడు ఎమ్మెల్యే, ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త మేకా వెంకట ప్రతాప్ అప్పారావు స్వామి కల్యాణ మహోత్సవానికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ కార్యకర్తల దాడి

చింతలపూడి: మండలంలోని సీతానగరం గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యకర్త అర్జునరావుపై శుక్రవారం రాత్రి టీడీపీ కార్యకర్తలు దాడికి దిగారు. వివరాల ప్రకారం గ్రామంలోని భూవివాదల నేపథ్యంలో ఇరువర్గాల దాడిలో అర్జునరావుపై టీడీపీ కార్యకర్తలు విరుచుకుపడ్డారు. ఈ దాడిలో గాయాలపాలైన బాధితుడిని చింతలపూడి ఆస్పత్రికి తరలించారు. బాధితుడిని ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి పరామర్శించి, మెరుగైన వైద్యం కోసం ఏలూరు తరలించాలని సూచించారు.

ఉరి వేసుకుని బాలిక ఆత్మహత్య

పాలకొల్లు సెంట్రల్: స్థానిక రామయ్యహాలు ప్రాంతంలో ఓ బాలిక ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం వేకువజామున (గురువారం రాత్రి) సుమారు 3 గంటల సమయంలో రామయ్యహాలుకు చెందిన అంగర వెంకట నారాయణ, నాగశైలజ కుమార్తె శృతి (12) ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. ఆ బాలిక పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతుంది. ఈ మేరకు బాలిక తల్లి శైలజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై బాదం శ్రీనివాసరావు తెలిపారు.

ముగిసిన గిరిజన క్రీడోత్సవాలు



బుట్టాయగూడెంలో బహుమతులను అందజేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో టీబీఆర్ యూత్ ఆధ్వర్యంలో హోరాహోరీగా జరిగిన గిరిజన క్రీడోత్సవాలు శుక్రవారం సాయంత్రంతో ముగిశాయి. అలాగే క్రీడాకారులకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం రాత్రి స్థానిక జెడ్పీ హైస్కూల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, వైఎస్సార్ సీపీ ఏలూరు పార్లమెంట్ సమన్వయ కర్త కారుమూరు సునీల్, ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తెల్లం రాజ్యలక్ష్మి తదితరుల చేతుల మీదుగా కబడ్డీ, వాలీబాల్, విలువిద్య క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. నగదుతో పాటు మెమెంటో, శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎం.సూర్యతేజ, జంగారెడ్డిగూడెం ఆర్డీఓ అద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రేమించి మోసగించిన వ్యక్తిపై ఫిర్యాదు

ఏలూరు టౌన్: నగరంలోని ఓ ప్రాంతానికి చెందిన యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన యువకుడితో పాటు అతని తల్లిపైన పోలీసులు చీటింగ్, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఏలూరులోని ఒక ప్రాంతానికి చెందిన ఒక యువతి (21) ఇంటర్ చదివి ఇంటి వద్ద ఉంటుంది. ఏలూరు అశోక్‌నగర్‌కు చెందిన అంబాల సాయికిరణ్ అనే యువకుడు పరిచయం అయ్యాడు. ప్రేమిస్తున్నాని పెళ్లి చేసుకుంటానని శారీరకంగా దగ్గర అయ్యాడు. అనంతరం ఇరువురు పెద్దలు వివాహం కోసం చర్చించుకునేందుకు సమావేశమయ్యారు. ఈ నేపథ్యంలో యువతి కుటుంబ సభ్యులు సాయికిరణ్ తల్లిదండ్రులను సంప్రదించగా వారు కులం పేరుతో దూషించి పెళ్లి చేసుకునేందుకు నిరాకరించారు. దీంతో బాధితురాలు ఏలూరు త్రీ టౌన్ పోలీసులను ఆశ్రయించింది.

కాలు జారి కాలువలో పడి వ్యక్తి మృతి

భీమడోలు: ఓ వ్యక్తి కాలుజారి గోదావరి కాలువలో మునిగి మృతి చెందిన ఘటన శుక్రవారం సాయంత్రం భీమడోలులో చోటు చేసుకుంది. భీమడోలు శివారు సాధుగారి దిబ్బ ప్రాంతానికి చెందిన దినసరి కూలీ పల్నాటి శ్రీను(50) మద్యం మత్తులో స్నానం చేసేందుకు లింగంపాడు వంతెన వద్ద గోదావరి కాలువలో దిగాడు. అయితే ప్రమాదవశాత్తూ కాలు జారీ నీటి ఉధృతికి కొట్టుకుపోయాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక అధికారి జి.నాగరాజు ఆధ్వర్యంలో రెస్క్యూ టీము హుటాహుటిన గోదావరి కాల్వ వద్దకు వచ్చి శ్రీను కోసం గాలింపు చర్యలు చేపట్టింది. సుమారు గంట సేపు గాలించి మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశారు. భీమడోలు ఎస్సై వై.సుధాకర్ మృతదేహాన్ని పరిశీలించి ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్సై సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతునికి భార్య, ముగ్గురు ఆడ పిల్లలు ఉన్నారు. అయితే గత కొన్నేళ్లుగా భార్య భర్తకు దూరంగా కువైట్‌లో ఉంటోంది. పిల్లలు కూడా తల్లి కుటుంబ సభ్యుల సంరక్షణలోనే ఉంటున్నారని బంధువులు పేర్కొన్నారు.